లోక్ అదాలత్‌లో 9642 కేసుల పరిష్కారం

● 82 సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ. 8,58,716 అందజేత

● రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 15 : ఈనెల 14న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 9642 కేసులు పరిష్కారమయ్యాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న (కాంపౌండబుల్) ఐపీసీ కేసులు 784, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్ట్ కేసులు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు 3045, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కేసులు 428, ఈ-పెట్టి కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, తదితల పెట్టి కేసులు 5385 కలిపి మొత్తం 9642 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. 82 సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ. 8,58,716 అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. టార్గెట్‌కు మించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన కోర్టు, మానిటరింగ్ సిబ్బందికి త్వరలో రివార్డులు అందజేస్తామని తెలిపారు.

పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

కత్తెరశాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ కుమార్

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 15 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ దీపక్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కిష్టంపేట, కత్తెరశాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగునీరు.. తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ సమీపంలోని దుర్గా భవాని కాలనీలో కార్తీక్ రెడ్డి (30) భార్య పల్లవితో కలిసి నివాసం ఉంటున్నారు. భార్య ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగి, కార్తీక్ రెడ్డి టూ వీలర్ షో రూమ్‌లో పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి అల్లూరి ప్రతాప్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎండీకి కృతజ్ఞతలు తెలిపిన కాంట్రాక్టు కార్మికులు

జైపూర్, డిసెంబర్ 15: జైపూర్ విద్యుత్‌కేంద్రంలో ఆదివారం పర్యటించిన సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు ప్లాంటులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కంపెనీ లాభాల్లో ప్రతి కాంట్రాక్టు కార్మికుడి ఐదు వేల నగదు అందించినందుకు కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పాటుగా ప్లాంటులో పని చేస్తున్న ప్రతి కార్మికుడికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలు ఇప్పించడంతో పాటు బ్యాంకు తరపున ప్రమాదబీమా సౌకర్యం కల్పించినందుకు కాంట్రాక్టు కార్మికులం దరం రుణపడి ఉంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎండీపై పూలుచల్లి కృతజ్ఞతలు తెలిపారు.

సీంఎడీకి కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజలు మూఢ నమ్మకాలు వీడాలి

-ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

ఎదులాపురం, డిసెంబర్ 15: ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆదిలాబాద్‌లో సైన్స్ కార్నివాల్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. జిల్లా కలెక్టర్ ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. సైన్స్ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, పద్మ శ్రీ అవార్డు గ్రహీత ప్రసాద్ రావ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, చీఫ్ సైంటిస్ట్ రాధ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ, రాష్ట్ర నాయకులు రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, శ్రీధర్‌బాబు, నాగరాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలను తిలకిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్, మాజీ మంత్రి

ఐదేళ్లలో సింగరేణిలో 7 కొత్త గనులు సాధిస్తాం

● ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్, డిసెంబర్ 15 : రానున్న ఐదేళ్లలో సింగరేణిలో 7 కొత్త గనులు సాధిస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన శ్రీ రాంపూర్ డివిజన్ ఐఎన్‌టీయూసీ జనరల్‌బాడీ స మావేశంలో 2025 క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల సాధనకు కృషి చేస్తున్నామని, రూ.20 లక్షల వరకు వడ్డీలేని గృహ రుణాలు సాధిస్తామని తెలిపారు. కార్మికులకు అలవెన్స్‌లపై ఐటీ రద్దు చేపిస్తామని హామీ ఇ చ్చారు. శ్రీరాంపూర్, రామగుండం ఏరియాల్లో గ్రేటెడ్ కమ్యూనిటీ డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మిస్తున్న ట్లు చెప్పారు. సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబ డి ఉందని చెప్పారు. సింగరేణి సంస్థను ఇతర రా ష్ట్రాల్లో విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఒడి షా నైనీ బొగ్గు బ్లాకులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని, ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగనుందని చెప్పారు. ఒడిషాలో 800 మెగావాట్ల విద్యు త్ ప్లాంట్, రాజస్థాన్‌లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి నిర్ణయించిందన్నారు. సింగరేణికి 2070 వరకు అభివృద్ధి ప్రణాళికలున్నాయని చెప్పారు. కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీ మా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కొత్తగూడెంలో సూపర్‌స్పెషాలిటీ దవాఖాన నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. కార్మికుల పిల్లల కారుణ్య నియామక వయసు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచినట్లు తెలిపారు. 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు సంస్థ లాభాల్లో నుంచి రూ.5 వేల బోనస్ ఇప్పించినట్లు తెలిపారు. సింగరేణి సంస్థ బొగ్గు ఆధారిత పరిశ్రమలు సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. యుతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ ఉపాక్షులు నర్సింహారెడ్డి, శంకర్‌రావు, కుమారస్వామి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగె స్వామి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, నాయకులు మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, వెంగల కుమాస్వామి, బీం రవి, మెండ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

వామ్మో చలి

దహెగాం, డిసెంబర్15 : జిల్లాలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండగా, చలి తీవ్రత పెరుగుతున్నది. ఉదయం.. సాయంత్రం చలి విజృంభిస్తుండడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఉదయం తొమ్మిదింటి వరకూ పొగమంచు తొలగడం లేదు. రైతులు, కూలీలు సాయంత్రం ఐదింటికే పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. చిన్నా పెద్దలంతా ఒకేచోట చేరి చలి మంటలు కాగుతూ సేదతీరుతున్నారు.

దహెగాంలో సాయంత్రం చలిమంటలు కాగుతున్న యువకులు

నేడు సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన, డిసెంబర్ 15: బెల్లంపల్లి ఏరియా లోని గోలేటిటౌన్‌షిప్ లో గల సీఈఆర్ క్లబ్‌లో సోమవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆ ధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటన లో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ల, మోకాళ్ల నోప్పులు, బీపీ, షుగర్, పక్షవాతము, అజీర్ణం, మలబద్దకం, అస్తమా, స్త్రీల వ్యాధులు మొదలగు వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

17న మందమర్రిలో..

మందమర్రి, డిసెంబర్ 15: ఈ నెల 17న మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో మాతా రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటనలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. ఈ శిబిరానికి ఇంతకు ముందు వచ్చిన వారు, కొత్తగా వైద్య కోసం వచ్చే వారు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

20, 21 తేదీల్లో దీపాలంకరణ పోటీలు

రెబ్బెన, డిసెంబర్ 15: బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో ఈ నెల 23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 20, 21 తేదీల్లో దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటన లో తెలిపారు. 20న మదారంటౌన్‌షిప్ లోని సింగరేణి డిస్పెన్సరీ ముందు, 21న గోలేటిలోని భీమన్న క్రీడామైదానంలో దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం 19వ తేదీలోపు గోలేటి జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో దరఖాస్తులు అందించాలని సూచించారు.

20న వెల్‌బేబీ షో

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 15: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న నస్పూర్ డిస్పెన్సరీలో పిల్లలకు వెల్ బేబీ షో నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్ ఆదివారం పేర్కొన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు వెల్‌బేబీ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే సింగరేణి ఉద్యోగులు, అధికారుల పిల్లల టీకాల పట్టిక, ఆధార్ కార్డులను 20న 11గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వెల్‌బేబీ షోలో 6 కేటగిరీలు బేబీ కింగ్, బేబీ క్వీన్, ప్రిన్స్-1,ప్రిన్స్-2, ప్రిన్సెస్-1, ప్రిన్సెస్-2 ఎంపిక చేసి బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆవుల రమేశ్

కాంగ్రెస్ పార్టీకి బిగ్‌షాక్

సొంత గూటికి చేరిన సీనియర్ నాయకుడు

గుడిహత్నూర్, డిసెంబర్ 15: గుడిహత్నూర్ మండల సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు తోషం గ్రామానికి చెందిన ఆవుల రమేశ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం గుడిహత్నూర్‌ని రాంమందిర్‌లో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సమక్షంలో చేరడంతో ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాజడి

యూపీఐపై క్రెడిట్ లైన్

ఎలా వాడుకోవాలో తెలుసా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పే లోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకు నుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు.

హింటిస్తే చాలు అల్లుకుపోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు.

తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసితనంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?

ప్రతీ మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చుంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరిచ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్న దాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాముల్ని చేయండి.

లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా ఆవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా ఇలా దేనికదే ముఖ్యమైనది మరి. దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదు.

చివరగా..

పిల్లలు తల్లిదండ్రులను చూస్తూ పెరుగుతారు. కాబట్టి మీరు ఆర్థిక క్రమశిక్షణతో ఉంటేనే మీ పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారన్నది గుర్తుంచుకోవాలి. మీ పొదుపు, మీ పెట్టుబడులు, మీ ఖర్చులన్నీ వారికి తెలిసేలా చేయండి. దీనివల్ల పారదర్శకత కూడా వస్తుంది. సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంత త్వరగా ప్రారంభిస్తే, ఎంత చిన్న వయసు నుంచే ఆరంభిస్తే అంత లాభాలు ఉంటాయన్నది మరువద్దు.

లాభాల స్వీకరణకు అవకాశం!

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కనిపిస్తున్నది. ఒడిదొడుకులు చోటుచేసుకుంటున్నా స్థూలంగా మదుపరులు పెట్టుబడులకే ప్రాధాన్యతనిస్తున్నారు. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 623.07 పాయింట్లు లేదా 0.76 శాతం ఎగబాకి 82,133.12 వద్ద నిలిచింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.50 పాయింట్లు లేదా 0.36 శాతం ఎగిసి 24,768.30 దగ్గర ముగిసింది. అయితే ఈ వారం ఈ లాభాలను మదుపరులు ఒడిసిపట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి. కానీ నవంబర్‌లో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తున్నది. ఫలితంగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు పెద్దపీట వేసే వీలు కూడా ఉందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరు తెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు ప్రధానం. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,100-25,300 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.